**త్రీడీ ప్రింటెడ్ బంకర్**

ఐఐటీ హైదరాబాద్ సహకారంతో హైదరాబాద్ స్టార్టప్ 'సింప్లిఫోర్జ్ క్రియేషన్స్' లేహ్‌లో భారత సైన్యం కోసం ఆన్‌సైట్ త్రీడీ ప్రింటెడ్ బంకర్‌ను నిర్మించారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి ఆన్‌సైట్ త్రీడీ ప్రింటెడ్ బంకర్. అత్యంత ఎత్తయిన ప్రదేశంలో కేవలం 30 శాతం ఆక్సిజన్ లభించే చోట మిలిటరీ బంకర్ నిర్మాణం దాదాపు అసాధ్యం. ఇలాంటి కఠినమైన వాతావరణంలో బుల్లెట్‌ను అడ్డుకోగల, కచ్చితమైన కొలతలతో త్రీడీ ప్రింటెడ్ టెక్నాలజీతో బంకర్ నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సుబ్రమణియం ఏప్రిల్ 17న వెల్లడించారు.

nipuna

Every Wednesday Free Supplement

05.

21 మే 2025

పేజీలు 8

# 'నక్సలైట్లు దేశభక్తులు' అంటూ అధికారం.. సీఎం అయ్యాక నిషేధం

## టీజీపీఎస్సీ గ్రూప్-2 పేపర్-4 (2024) ప్రశ్నలకు వివరణాత్మక సమాధానాలు

1. నక్సలైట్ల ఉద్యమానికి సంబంధించి 'ఇప్పటి నుంచి నాట్యం లేదు, పాట లేదు, ఉపన్యాసం లేదు' అని ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని గుర్తించండి?

1) ఎన్టీ రామారావు 2) చంద్రబాబు నాయుడు
3) వైఎస్ రాజశేఖర్ రెడ్డి 4) జలగం వెంగళరావు

**సమాధానం: 1- ఎన్టీ రామారావు**

**వివరణ:** మార్క్సిస్ట్-లెనినిస్ట్-మావోయిస్ట్ సిద్ధాంతాలతో ప్రేరణ పొందిన ఒక మార్గదర్శక వర్గ పోరాటం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సామాజిక-రాజకీయ చరిత్రలో ముఖ్యమైన పాత్ర పోషించింది.

- గ్రామీణ భారతదేశంలోని సామాజిక, ఆర్థిక అసమానతలు, భూవివాదాల నుంచి ఆవిర్భవించిన ఈ ఉద్యమం రాష్ట్రంలోని గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లోని అణగారిన వర్గాలను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈ ప్రాంతాల్లో పేదల భూముల ఆక్రమణ-పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటంతో పాటు ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా ఉందన్న విమర్శ ఉంది. పీపుల్స్‌వార్ గ్రూప్, సాంస్కృతిక విభాగం అయిన జన నాట్య మండలి వంటి సంస్థలు ప్రజల మద్దతు పొందడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. రకరకాల విప్లవ గీతాలు, వీధి నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యం పెరిగింది.
- రాష్ట్రంలో నక్సలైట్ భావజాలం పెరుగుతున్న క్రమంలో నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో వివిధ వేదికలపై నక్సలైట్ ఉద్యమాన్ని ఉద్దేశించి ఇక నుంచి రాష్ట్రంలో 'డాన్స్ లేదు, పాట లేదు, ఉపన్యాసం లేదు' అని ప్రకటించి విప్లవ కార్యక్రమాలకు సంబంధించిన ప్రజా ప్రదర్శనలను నిషేధించారు. ఇది రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం ఎంచుకున్న కఠినమైన దృక్కోణాన్ని సూచించింది.
- పోలీస్ చర్యలు పెరిగిన తర్వాత నక్సలైట్ ఉద్యమం సాంస్కృతిక చైతన్యం నుంచి గూఢచర్య శస్త్ర పోరాటం దిశగా మారింది. గెరిల్లా వ్యూహాలు, పోలీసులపై దాడులు, రాష్ట్ర బలగాలపై ఆత్మరక్షణ చర్యలు ఆందోళనగా మారాయి.

2. ఎన్టీ రామారావుకు సంబంధించిన వ్యాఖ్యల్లో సరైనది?

ఎ. 1983 ఎన్నికల సమయంలో 'నక్సలైట్లు నిజమైన దేశభక్తులు. నక్సలైట్ల ఎజెండానే నా ఎజెండా' అనే నినాదంతో ఎన్టీ రామారావు ప్రచారం చేశాడు

బి. తెలుగు తల్లి అనే భావనను ప్రచారం చేయడం, ట్యాంక్‌బండ్‌పై ఆంధ్రుల విగ్రహాలను ఏర్పాటు చేసి ఎన్టీ రామారావు తెలంగాణ సమాజ సాంస్కృతిక పునాదులపై దాడి చేశాడు

**సమాధానం: ఎ, బి సరైనవి**

**వివరణ:** ఎ- ఎన్టీ రామారావు 1982, మార్చిలో తెలుగు దేశం పార్టీని స్థాపించాడు. 1983, జనవరిలో జరిగిన ఎన్నికల్లో 201 స్థానాలు గెలుచుకున్నాడు.

- 1970, 1980 మధ్య కాలంలో తెలంగాణ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో నక్సలైట్ ఉద్యమం బలంగా కొనసాగింది. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నక్సలిజాన్ని అరికట్టడానికి అనేక చర్యలు చేపట్టింది.
- ఎన్టీ రామారావు నక్సలైట్ల హింసాత్మక మార్గాలకు మద్దతు ఇవ్వలేదు. కానీ వారి సామాజిక ఆర్థిక డిమాండ్లను గుర్తించడంతో పాటు వారిపై సానుభూతి చూపుతూ 'వారి ఎజెండానే నా ఎజెండా, వారు నిజమైన దేశ భక్తులు' అన్నట్లు మీడియా ద్వారా అనేక సందర్భాల్లో వెల్లడయ్యింది.
- ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత నక్సలైట్లకు మద్దతివ్వలేదు. కానీ వారి కీలక డిమాండ్లలో కొన్నింటిని నెరవేర్చేలా ప్రభుత్వ విధానాలను రూపొందించాడు. **ఉదా:** రూ. 2 కిలో బియ్యం పథకం, రైతులకు సహాయం, భూముల పంపిణీ, ఇళ్ల నిర్మాణ పథకం

బి- పెద్దమనుషుల ఒప్పందం ద్వారా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతం ఆంధ్రా ఆధిపత్య ధోరణి వల్ల సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అనేక విధాలుగా దోపిడీకి గురయ్యింది.

- 1982లో ఎన్టీ రామారావు రాజకీయాల్లోకి వచ్చి 'తెలుగు ఆత్మగౌరవం' నినాదాన్ని తెరపైకి తెచ్చాడు.




- తెలుగు తల్లి భావనను, విగ్రహాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చాడు. తెలుగు తల్లి విగ్రహ రూపకల్పన, వేషధారణ ఆంధ్ర ప్రాంత శైలిలో, ఆంధ్ర ఆధిపత్యాన్ని చూపే విధంగా తయారు చేశారే తప్ప తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక విలువలు (స్థానిక సంప్రదాయాలు, ఉర్దూ, దక్కనీ శైలులు) ప్రతిబింబించలేదన్న విమర్శ ఉంది.
- 1986లో ఎన్టీ రామారావు ట్యాంక్ బండ్‌పై 33 మంది ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటు చేశాడు. వీరిలో ఎక్కువ మంది ఆంధ్ర ప్రాంతానికి చెందినవారే ఉన్నారు.
- నిజాంల కాలం నాటి హైదరాబాద్ చరిత్రలో తెలంగాణ ప్రాంతానికి అధిక ప్రాధాన్యం ఉన్నప్పటికీ ట్యాంక్ బండ్‌పై ఆంధ్ర ఆధిపత్యం స్పష్టంగా బయటపడటంతో పాటు తెలంగాణ సమాజ సాంస్కృతిక పునాదులపై ఎన్టీ రామారావు దాడి చేశాడన్న విమర్శ తలెత్తింది.
- తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వాన్ని కాపాడుకునే క్రమంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనివార్యంగా మారింది.

3. తెలుగు గుర్తింపునకు సంబంధించి సరైనవి గుర్తించండి?

ఎ) రాష్ట్ర సెక్రటేరియట్ సమీపంలో తెలుగు తల్లి విగ్రహాన్ని స్థాపించారు

బి) ప్రపంచ తెలుగు మహాసభ సందర్భంగా కుందురు ఆంజనేయ శాస్త్రి 'మా తెలుగు తల్లికి మల్లె పూదండ' అనే పాటను రచించాడు

సి) పబ్లిక్ గార్డెన్‌లో తెలుగు వెలుగు మ్యూజియాన్ని ప్రారంభించారు

డి) తెలంగాణ కవులు, రచయితలను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదు

**సమాధానం: ఎ, సి, డి సరైనవి. బి తప్పు**

**వివరణ:** 'మా తెలుగు తల్లికి మల్లె పూదండ' అనే పాటను శంకరంబాడి సుందరాచారి రచించాడు.

- ఈ పాటను 1942లో విడుదలైన తెలుగు సినిమా 'దీన బంధు' కోసం రచించాడు. ఈ పాటను ఆ సినిమాలో చేర్చలేదు. తర్వాత ఈ పాటకు సంగీతాన్ని టంగుటూరి సూర్యకుమారి అందించగా ప్రజాదారణ పొందింది. దీంతో ఈ పాటను 1975లో నాటి ప్రభుత్వం అధికారిక రాష్ట్ర గీతంగా ప్రకటించింది.

4. కింది వాటిలో సరైనవి ఏవి?

ఎ) అధికారాన్ని కైవసం చేసుకోవడానికి 1983లో తెలుగు దేశం పార్టీ తెలుగు గౌరవం, తెలుగు ఐక్యతను ప్రాముఖ్యంలోకి తీసుకువచ్చింది

బి) రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ ఇతర వెనుకబడిన కులాలకు, యువ వర్గాలకు, ప్రజలకు దగ్గరయ్యింది

**సమాధానం: ఎ, బి సరైనవి**

**వివరణ:** ఎ- 1956 నుంచి దశాబ్దం పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ పాలించడం, పదే పదే ముఖ్యమంత్రులను మార్చడం (5 సంవత్సరాల్లో 7 మంది సీఎంలు), ప్రాంతీయ నాయకత్వ లోపం, ఇతర అనేక కారణాల వల్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొన్నది.

- తెలుగు వారు తమ భాష, సంస్కృతి, ఆత్మగౌరవం కేంద్ర ప్రభుత్వ చేతుల్లో నిర్లక్ష్యంగా పరిణమిస్తుందని భావించసాగారు.
- ఇలాంటి నేపథ్యంలో ఎన్టీ రామారావు 1982లో తెలుగు దేశం పార్టీని స్థాపించాడు. తెలుగు ఆత్మగౌరవం అనేది టీడీపీ ప్రచారంలో ప్రధాన అంశంగా నిలిచింది.
- తెలుగు ఐక్యత అనే నినాదం కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల మధ్య ఉన్న భిన్నతలను తొలగించి తెలుగు వారంతా ఒక్కటిగా ఉండాలనే సంకల్పాన్ని సూచించింది. ఈ భావనలు ప్రజల మనసుల్లో తెలుగు గౌరవం, గుర్తింపు, స్వయంపాలన పట్ల ఆకాంక్షను కలిగించాయి.

బి- 1956 నుంచి 80 వరకు ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన కాంగ్రెస్ పార్టీలో అగ్రకులాల ఆధిపత్యం స్పష్టంగా వెల్లడయ్యింది. ఇతర వెనుకబడిన తరగతులు, యువతకు రాజకీయ ప్రాతినిధ్యం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ వర్గాల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరిగింది.

- జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న గౌడ, యాదవ వంటి వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించింది టీడీపీ. 'తెలుగు ఆత్మగౌరవం' నినాదం యువతను ప్రభావితం చేసింది. దీన్ని అనుకూలంగా మార్చుకున్న ఎన్టీఆర్ ఈ వర్గాలకు ఎక్కువ అసెంబ్లీ స్థానాలను కేటాయించడం, అత్యధికమంది శాసన సభ్యులు, మంత్రులుగా ఎన్నికయ్యారు. దీంతో టీడీపీ ఈ వర్గాలకు మరింత చేరువయ్యింది.

5. సరికాని జతను గుర్తించండి?

1) పీపుల్స్ వార్ గ్రూప్ కేఎస్ వ్యాస్‌ను హత్య చేసింది- 1993

2) కన్సర్న్డ్ సిటిజన్స్ కమిటీ ఏర్పాటు- 1996

3) గుర్తేడు దగ్గర ఏడుగురు ఐఏఎస్ అధికారుల అపహరణ- 1989

4) పీపుల్స్ వార్ గ్రూప్‌పై నిషేధం- 1992

**సమాధానం: 3**

**వివరణ:** 1987, డిసెంబర్ 27న ఆంధ్రప్రదేశ్‌లోని గుర్తేడు ప్రాంతంలో ఏడుగురు ఐఏఎస్ అధికారులను కిడ్నాప్ చేసిన సంఘటన జరిగింది (1989 కాదు).

- తూర్పు గోదావరి జిల్లా వై రామవరంలో అధికారులు ఒక సమీక్షా సమావేశాన్ని ముగించుకుని తిరిగి వస్తుండగా ప్రజా యుద్ధ గ్రూప్ (పీడబ్ల్యూజీ) అనే మావోయిస్ట్ సంస్థ ఈ కిడ్నాప్‌నకు పాల్పడింది.
- ఈ సంఘటనలో ఆంధ్రప్రదేశ్ అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఆర్ శంకరన్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఎంవీపీ శాస్త్రి సహా ఏడుగురు ఐఏఎస్ అధికారులు కిడ్నాప్‌నకు గురయ్యారు.
- మావోయిస్టులు తమ ఏడుగురు సహచరులు, ఒక స్థానిక అనుచరుడిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చర్చల తర్వాత ఎన్టీఆర్ ప్రభుత్వం ఆ డిమాండ్లను అంగీకరించి అధికారులను విడుదల చేయించింది.

**నోట్:** ఈ సంఘటన దేశ వ్యాప్తంగా, అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. ఇది ఆంధ్రప్రదేశ్ నక్సలైట్ ఉద్యమ చరిత్రలో గుర్తింపు పొందడంతో ఈ సంఘటన గురించి పరీక్షలో అడిగారు.

6. నక్సలైట్ ఉద్యమ సంఘటనలు, సంవత్సరాలను జతపర్చండి?

| | |
|---|---|
| ఎ. ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి యూనియన్ | 1. 1978 |
| బి. ముద్దెనూర్ గ్రామంలో పటేల్ నారాయణ హత్య | 2. 1987 |
| సి. అల్లంపల్లి అడవుల్లో నక్సలైట్లతో 10 మంది పోలీసుల హత్య | 3. 1974 |
| డి. తాడిచెర్ల మండల అధ్యక్షుడు మల్హర్ రావు హత్య | 4. 1988 |
| | 5. 1989 |

**సమాధానం: ఎ-3, బి-1, సి-2, డి-4**

7. కింది వ్యాఖ్యల్లో సరైనది ఏది?

ఎ) ఆరు సూత్రాల పథకం ద్వారా ఏర్పాటైన తెలంగాణ ప్రాంతీయ బోర్డును తెలుగుదేశం ప్రభుత్వం రద్దు చేసింది

బి) విజయవాడలో స్థాపించిన ఆరోగ్య విశ్వవిద్యాలయం, ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నది

**సమాధానం: ఎ, బి**

**వివరణ:** ఎ- పెద్ద మనుషుల ఒప్పందం (1956) ప్రకారం తెలంగాణకు కల్పించిన రక్షణల్లో తెలంగాణ ప్రాంతీయ మండలి ఏర్పాటు కీలకమైన అంశం.

- పెద్ద మనుషుల ఒప్పందంలోని దాదాపు అన్ని అంశాలు (రక్షణలు) ఉల్లంఘనకు గురికావడంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 1969లో ఉద్యమం మొదలయ్యింది. ఈ ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యోగులు క్రియాశీలకంగా పాల్గొన్నారు. కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉద్యోగ నియామకాలు, ఖమ్మంలో రవీంద్రనాథ్ ఆమరణ నిరాహార దీక్ష, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళనలు, కోర్టు తీర్పులు, ముల్కీ నిబంధనల అమలు. వీటికి వ్యతిరేకంగా 1972లో జై ఆంధ్ర ఉద్యమం నేపథ్యంలో 1973లో కేంద్ర ప్రభుత్వం ఆరు సూత్రాల ఫార్ములాను ప్రకటించింది.
- ఈ ఫార్ములాలో భాగంగా తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర కోసం ప్రాంతీయ అభివృద్ధి బోర్డుల ఏర్పాటు, ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యలో స్థానికులకు ప్రాధాన్యం, ముల్కీ నిబంధనల రద్దు, 32వ రాజ్యాంగ సవరణ (1973) ద్వారా 1975లో రాష్ట్రపతి ఉత్తర్వులను జారీ చేసి జోనల్ విధానాన్ని ప్రవేశ పెట్టారు.
- 1983లో అధికారంలోకి వచ్చిన టీడీపీ తెలంగాణ ప్రాంతీయ బోర్డును 1984లో రద్దు చేసింది. ప్రాంతీయ బోర్డులు ప్రాంతీయ విద్వేషాలను పెంచుతాయన్న ఉద్దేశంతో వాటిని రద్దు చేసినట్లు నాటి ప్రభుత్వం పేర్కొనడాన్ని తెలంగాణ వాదులు తీవ్రంగా ఖండించారు.
- హైదరాబాద్ సంస్థానంలో అతిపెద్ద భౌగోళిక నిర్మాణమైన తెలంగాణ 1956లో ఆంధ్రప్రదేశ్‌లో ఒక వెనుకబడిన ప్రాంతంగా మారింది. ఆంధ్ర ప్రాంత ఆధిపత్యం అణువణువునా కనపడటమే కాకుండా చివరకు ఎలాంటి రక్షణలు లేని ప్రాంతంగా నాటి ప్రభుత్వాలు మార్చివేశాయి. దీంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తప్ప ఈ ప్రాంతానికి రక్షణ ఉండదని భావించి దాదాపు ఐదున్నర దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమం జరిగి వేలాది మంది అమరుల త్యాగాల ఫలితంగా 2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.

బి- 1980 దశకంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య, విద్యా రంగంలో ఒక ప్రధానమైన మార్పు చోటు చేసుకుంది. అప్పటివరకు ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్), ఆంధ్రా యూనివర్సిటీ (విశాఖపట్నం), శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ (తిరుపతి) వంటి సాధారణ యూనివర్సిటీల ఆధీనంలో మెడికల్, డెంటల్, నర్సింగ్ కాలేజీలు నడుస్తున్నాయి.

- వైద్య విద్యకు ప్రత్యేకమైన మేనేజ్‌మెంట్ అవసరం ఏర్పడింది. వైద్యరంగంలో వేగంగా జరుగుతున్న అభివృద్ధులను అందిపుచ్చుకోవడానికి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో దేశంలోని అనేక రాష్ట్రాలు ప్రత్యేకమైన ఆరోగ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసుకున్నాయి.
- రాష్ట్రంలోని అన్ని వైద్య, నర్సింగ్, డెంటల్ సంబంధిత మెడికల్ కాలేజీలను ప్రత్యేక యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చే లక్ష్యంతో నాటి సీఎం ఎన్టీఆర్ 1986లో విజయవాడలో ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు.
- 1846లో హైదరాబాద్ మెడికల్ స్కూల్‌గా స్థాపించిన ఉస్మానియా మెడికల్ కాలేజీ, గాంధీ మెడికల్ కాలేజీ 1986లో విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోకి మార్చారు. దీంతో తెలంగాణలో వారసత్వ అస్తిత్వానికి ప్రతిబింబమైన ఉస్మానియా మెడికల్ కాలేజీ వంటి ఆరోగ్య విద్యా సంస్థలను విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోకి తెచ్చుకోవడం ఆంధ్రా ఆధిపత్యానికి నిదర్శనమని తెలంగాణ వాదులు ఉద్యమంలో పదే పదే పేర్కొన్నారు.

**నూతనకంటి వెంకట్**
పోటీ పరీక్షల నిపుణులు,
ఆర్గనైజింగ్ సెక్రటరీ
తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంఘం
9849186827

